క్లుప్తంగా

విగ్రహాల ఊరేగింపు


విగ్రహాల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కంగాలవారి గూడెంలోని కొమ్ముగూడెంలో గురువారం రామసీతా లక్ష్మణ హనుమాన్ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మండపారాధన, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, అగ్ని ప్రతిష్టాపన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8.47 నిముషాలకు విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం


సుదర్శన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి స్థల దాత మనమడు సుదర్శన్ పాఠశాల అభివృద్ధికి రూ.1 లక్ష అందజేసినట్టు ప్రధానోపాధ్యాయుడు కె.రాఘవన్ తెలిపారు. స్వీడన్‌లో ఉంటున్న సుదర్శన్ ఈ పాఠశాలను గురువారం సందర్శించారు. తన తాత ఆశయ సాధనకు సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశామన్నారు. సుదర్శన్‌ను ఉపాధ్యాయులు శాలువా కప్పిసత్కరించారు.

పొగాకు నిషేధంపై స్పెషల్ డ్రైవ్


ఆలయ తూర్పు ప్రాంతంలో పొగాకు కాల్చిన ఆనవాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాల నిషేధంపై గురువారం థర్డ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి సీహెచ్ మానస సూచనల మేరకు ఆలయ ప్రాంగణంలోని పలు చెక్ పాయింట్స్‌ను సందర్శించి, అక్కడ టొబాకో కాల్చిన ఆనవాళ్లు, ఆలయానికి సమీపంలో ఉన్న దుకాణాలను తనిఖీ చేశారు. ఆలయ సూపరింటిండెంట్ రమణరాజు, పోలీస్ అవుట్‌పోస్ట్ ఎస్సై ఆంజనేయులు, ఎన్‌టీసీపీ సైకాలజిస్ట్ కె.చినవీర్రాజు, డీసీఎం ఎస్.వెంకట్, సిబ్బంది ఉన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత అనీల్ గుప్తాజీకి బాండ్ పత్రం అందిస్తున్న ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముంబాయికి చెందిన అనీల్ గుప్తాజీ గురువారం రూ.1,01,116 లను విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రం అందించారు.

యువజనోత్సవాల్లో విద్యార్థులకు బహుమతులు


కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న విద్యార్థులు

కామవరపుకోట: యువజనోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జి.శ్రీను వ్యాసరచన పోటీలో ప్రథమ, క్విజ్‌లో ఆడమల్లి ప్రవీణ్ కుమార్, జి.శ్రీను తృతీయ స్థానాల్లో నిలిచి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రంతోపాటు బహుమతులు అందుకున్నట్టు ప్రిన్సిపాల్ కె.విజయబాబు తెలిపారు. విద్యతో పాటు సాంస్కృతిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రహదారులకు మహర్దశ

- టెండర్ల దశలో పట్టిన్నపాలెం బ్రిడ్జి
- తాజాగా బైనేరు బ్రిడ్జికి ప్రతిపాదనలు


చింతలపూడి, కామవరపుకోట, మక్కినవారిగూడెం రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం


జగ్గవరం- కేతవరం రోడ్డు నిర్మాణ దృశ్యం →

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో చేపట్టిన పలు రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పలు బ్రిడ్జిల నిర్మాణానికి కూడా అధికారులు చర్యలు తీసుకున్నారు. మరికొన్ని రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇవన్నీ పూర్తయితే ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి.
- జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెం వద్ద జల్లేరువాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు గతంలో ప్రారంభించారు. అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తి చేసేందుకు ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు రూ.3.20 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ప్రస్తుతం ఇది టెండర్ దశలో ఉంది.

- జంగారెడ్డిగూడెం శివారు బైనేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి తాజాగా రూ.3.50 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు తయారు చేశారు. దీనికి సీఆర్ఎఫ్ నిధుల నుంచి ప్రతిపాదనలు చేయగా, సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది.
- చింతలపూడి, కామవరపుకోట, మక్కినవారిగూడెం రోడ్డుకు రూ. 2.90 కోట్లు వెచ్చించి పనులు చేపట్టడంతో కొనసాగుతున్నాయి.
- జగ్గవరం నుంచి మండలంలోని కేతవరం వరకు 8 కిలోమీటర్ల మేర ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ. 2.50 కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి.
- పోతవరం నుంచి జంగారెడ్డిగూడెం కాకర్ల వై.జంక్షన్ వరకు సీఆర్ఎఫ్ నిధులు రూ.23.40 కోట్లతో పనులు చేపట్టగా, కొంత మేర పూర్తి కాగా, స్థానిక కరాటం వై.జంక్షన్ నుంచి కాకర్ల వై.జంక్షన్ వరకు పనులు చేపట్టాల్సి ఉంది.
- రాజవరం నుంచి లక్కవరం వరకు 7.5 కిలోమీటర్ల మేర రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.
- పొంగుటూరు - రాజవరం వరకు 11కిలోమీటర్ల మేర ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రూ. 9 కోట్లతో రోడ్డును నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు.
- యర్నగూడెం నుంచి పొంగుటూరు వరకు 15 కిలోమీటర్ల మేర రూ. 21 కోట్లతో ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేశారు.
- కన్నాపురం - కొయ్యలగూడెం వరకు రూ.3.50 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.
- యర్రగుంటపల్లి - లక్ష్మీపురం వరకు 15 కిలోమీటర్ల మేర రూ. 3కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
- మక్కినవారిగూడెం నుంచి టి.నరసాపురం వరకు సుమారు 12 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 3కోట్లు కేటాయించనున్నారు.

చురుగ్గా రోడ్ల నిర్మాణం



సబ్ డివిజన్ పరిధిలో రోడ్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్ని రోడ్లకు ప్రతిపాదనలు చేశాం. పట్టిన్నపాలెం బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. బైనేరు వాగుపై నిర్మించబోయే బ్రిడ్జి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా, సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది.
– సీహెచ్ హరికృష్ణ, డీఏఈ , ఆర్అండ్‌బీ, జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్

లోక్అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి షరీఫ్

చింతలపూడి: పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లు చక్కటి మార్గమని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై స్థానిక కోర్టు వద్ద గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరి, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరి, కుటుంబ తగాదా కేసులను పరిష్కారించుకోవచ్చని, ఇప్పటికే నోటీసులు అందుకున్న కక్షిదారులు కేసుల సమాచారం కోసం పోలీస్, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కొయ్యలగూడెం: మండలంలోని బయ్యనగూడెం గ్రామ ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు మార్పిడి నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.కోటి చొప్పన పరిహారం చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలోని అంబటి ఆయిల్ మిల్లు ప్రమాదంలో ఏడుగురు కార్మికుల మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ చేయించి, యజమాన్యం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులను అరెస్టు చేయాలని, మరణించిన ఒక్కో కార్మికుని కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేసింది.

200 మందికి వైద్య పరీక్షలు

టి.నరసాపురం: ఆరోగ్యశ్రీ పథకం గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బొంతు అంజిబాబు అన్నారు. టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లిలో చింతలపూడికి చెందిన సాయిస్ఫూర్తి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ బొంతు రమాదేవి ప్రారంభించారు. జనరల్, ఎముకులు, స్త్రీ, చిన్నపిల్లల వైద్యనిపుణులు 200 మంది రోగుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ బొంతు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు

కొయ్యలగూడెం: తాను నివాసం ఉంటోన్న స్థలంలోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ.. చంపుతామని బెదిరించి, అర్ధరాత్రిళ్లు భయందోళనకు గురిచేస్తున్నారంటూ స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉండే గెద్ద రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బాబూరావు తెలిపారు. కొయ్యలగూడెంకు చెందిన గంగిరెడ్ల సతీష్, నక్కా బాబి, ఏపూరి సతీష్ మరో నలుగురుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

చింతలపూడి: మండలంలోని ముక్కంపాడు గ్రామంలో గురువారం పెంకుటిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జి.బాబూరావు అనే వ్యక్తి ఇంట్లో మంటలు చెలరేగాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

ద్వారకాతిరుమల: అప్పుగా తీసుకున్న సొమ్ము వెంటనే తిరిగి ఇవ్వాలంటూ రైతుపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ గురువారం తెలిపారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంకు చెందిన రైతు కదలి వెంకటేశ్వరరావు అదే మండలం లైన్ గోపాలపురానికి చెందిన గాది శ్రీనివాసరావు వద్ద కొన్నాళ్లక్రితం 10 రోజుల్లో తీరుస్తానని రూ.6 వేలు అప్పుగా తీసుకున్నాడు. వెంకటేశ్వరరావు బుధవారం సాయంత్రం సూర్యచంద్రరావుపేటలోని తన పొలంలోకి వెళుతుండగా, శ్రీనివాసరావు అడ్డగించి, డబ్బులు ఇవ్వాలంటూ చేతిలో ఉన్న ఇటుక రాయితో తలపై కొట్టాడు. తీవ్ర గాయాలుపాలైన వెంకటేశ్వరరావు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


సాయం అందిస్తున్న తహసీల్దార్ సుమతి

పోలవరం రూరల్: స్థానిక కమ్మరిగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు కోల్పోయిన బాధితులకు తహసీల్దార్ బి.సుమతి సాయం అందించారు. తూరపాటి అచ్చమ్మ, కప్పల మంగాయమ్మలకు చెందిన తాటాకిల్లు బుధవారం కాలి బూడిదైంది. ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు 30 కేజీల బియ్యం, రూ.5 వేలు అందజేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ఎలీజా


మారుతీగర్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం ఆయన చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని మారుతీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను వివరించారు. నవరత్న పథకాల బ్రోచర్లను అందజేశారు. కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రహదారులు నిర్మించాలని, పక్కా డ్రెయిన్లు మంజూరు చేయాలని, స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. తొలుత ఎమ్మెల్యే ఎలీజాకు ప్రజలు నీరాజనం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, సొసైటీ చైర్మన్ చుండూరి నాగేశ్వర్రావు, రామరాజు నాయక్, తోట కుమార్, మిరియాల దిలీప్, ఎం.ఇమ్మానియేలు, ఎస్.కాంతారావు, వెంపా కృష్ణ, చెంచమరాజు, నాగేశ్వరరావు, బోడా బాల, పేర్రాజు, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గంగవరం గణపతి ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు, అభయాంజనేయస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఇందిరానగర్ కాలనీ అభయాంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ వలవల తాతాజీ, మేరీ సుశీలా దంపతులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. వేదపండితులు పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి వారిని మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, చిన్న దంపతులు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి సోంబాబు తదితరులు దర్శించుకున్నారు. అభినయ కూచిపూడి నాట్య అకాడమి వ్యవస్థాపకురాలు శీలా రూపాదేవి శిష్యబృందం నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎస్ ధనకుమార్ ప్రవచనం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు స్థానిక సాయి స్ఫూర్తి హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య, నేత్ర వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. దీనిని మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి, రాజమండ్రి గౌతమి నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటుచేసిన శిబిరాన్ని కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు ప్రారంభించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, పాములపర్తి శ్రీనివాసరావు, యువరాణి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ గంగవరం లక్ష్మీ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీ గణపతి హోమం, పంగిడిగూడెం తిరుమల తిరుపతి సంఘం మహిళా భక్త బృందం వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కంచర్ల అన్నవరం, కుర్రు నాగబాబు, మద్దిపాటి సోమేశ్వరరావు దంపతులు హోమం, కల్యాణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు


సమావేశమైన కొయ్యలగూడెం మేజర్ పంచాయతీ పాలకవర్గం

కొయ్యలగూడెం: పరింపూడి మేజర్ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో ఈఓ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బోర్డు సమావేశంలో ప్రణాళికలు చేశారు. టౌన్‌లో రూ.5 లక్షలతో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పాతపరింపూడి, మూడో వార్డు ఎంపీపీ స్కూల్, కాళింగుల పేట, తారక రామానగర్ ప్రాంతాల్లో సత్యసాయి తాగునీటి వాటర్ ట్యాంకులు నిర్మించాలని, 12 చోట్ల రూ.24 లక్షలతో రబ్బిష్ రోడ్ల నిర్మాణం, రూ.5 లక్షలతో నేషనల్ హైవే ప్రధాన రహదారికి అంతర్గత రోడ్ల అనుసంధానం, రూ.3 లక్షలతో జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లు ఎత్తు పెంచే అంశాలపై సభ్యులు తీర్మానం చేశారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు ప్రారంభించాలన్నారు. పెద్ద నూతి వద్ద, శ్రీరామ్ నగర్‌లో శిథిల ట్యాంకు స్థానంలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణానికి తీర్మానించారు. రెండుచోట్ల లక్ష లీటర్ల సామర్థ్యంతో తాగునీటి వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేని పంచాయతీ పాలకవర్గం కోరింది.

16 నుంచి శివరాత్రి ఉత్సవాలు


కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

టి.నరసాపురం: స్థానిక అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ శివరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం ఆలయం వద్ద విడుదల చేశారు. ఆలయకమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు మాట్లాడుతూ భక్తుల సహకారంతో 26 సంవత్సరాలుగా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 27వ కల్యాణ ఉత్సవాలు ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభమై ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్‌టీ స్వామి, వైద్యాధికారి శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు, ఎస్సై కె.సతీష్‌కుమార్, సర్పంచ్ మోదుగు సునంద, సొసైటీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, పార్టీ నాయకులు సీతారామ ప్రసాద్, ఉత్సవ కమిటీ నాయకులు పర్వతనేని మురళి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

కుక్కునూరు: శివరాత్రి సందర్భంగా శివాలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ డీ ఎల్ ప్రమద్వర సూచించారు. గురువారం ఆమె కుక్కునూరు ఎంపీడీఓ కార్యాలయంలో శివరాత్రి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పెద్దరావిగూడెం ఆలయంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లంకి లక్ష్మణ్‌రావుకు సూచించారు. అధికారులు హాజరుకాకపోవడం పట్ల జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు అసహనం వ్యక్తం చేశారు. ఎస్సై వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై హోర్డింగ్స్



రాష్ట్ర సరిహద్దులో హోడింగ్‌ను ఏర్పాటు చేసిన సీఐ మణికంఠా రెడ్డి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం సమీపంలోని ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ సేవించడం వల్ల కలిగే అనారోగ్యం, రవాణాపై పడే శిక్షలను తెలియజేస్తూ సీఐ మణికంఠా రెడ్డి ఆధ్వర్యంలో హోడింగ్స్ ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ బోర్డులను ఏర్పాటు చేశామని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ మణికంఠ పేర్కొన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో రామ భక్తులు


రథయాత్ర నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: రామ భక్తులు పాదయాత్రగా వచ్చి జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. వాసుదేవానంద స్వామీజీ ఆధ్వర్యంలో శిష్య బృందం 300 మంది పాదయాత్రగా మద్ది క్షేత్రానికి చేరుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రథయాత్ర నిర్వహించారు. ఆలయ ఈఓ కొండలరావు పాల్గొన్నారు. సీతారామచంద్ర స్వామి 12వ రథ పాదయాత్రలో భాగంగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్నట్లు వాసుదేవానంద స్వామి తెలిపారు.

పారిజాతగిరిలో వాడపల్లి ఆలయ ఈఓ


వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఈఓ

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి వారిని గురువారం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ సత్యనారాయణ రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈఓ సత్యనారాయణరాజు దంపతులను అర్చకులు వేదాశీర్వాదం ఇచ్చి, స్వామి వారి శేషవస్త్రాలు అందించారు. తొలుత ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని సత్యనారాయణరాజు తెలిపారు. ఈఓ మానికల రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండాకు తెగులు నివారణ చర్యలు


తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కొయ్యలగూడెం: వరి పైరును ఎండాకు తెగులు ఆశిస్తోందని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. ఈ తెగులు నివారణకు కొయ్యలగూడెం సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులకు గురువారం అవగాహన కల్పించారు. రెండు గ్రాములు కాపర్ హైడ్రాక్సైడ్, గ్రాము ప్లాంటమైసిన్ లీటర్ నీటిలో కలిపి వరిపై పిచికారీ చేయాలని, చేలలో ఎప్పటికప్పుడు నీరు మార్చుతూ ఉండాలని, నత్రజని సంబంధిత ఎరువులు యూరియా ఒకేసారి కాకుండా దఫ దఫాలుగా వేయాలని సూచించారు. పొటాషియం సంబంధిత ఎరువు మొదటి దఫా 20 కేజీలు వేయాలన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు కాట్రాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా మూడు మిల్లీ లీటర్ల క్లోరైడ్ కిలిప్రోలు లీటర్ నీటిలో కలిపి వరిపై పిచికారీ చేయాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ సూచించారు.

ఆలయ బోర్డు చైర్మన్‌గా వీరరాఘవులు

కామవరపుకోట: మండలంలో తడికలపూడి గంగేశ్వరస్వామి ఆలయ బోర్డు చైర్మన్‌గా కూరకుల వీర రాఘవులు, వైస్ చైర్మన్‌గా చాత్రాతి వెంకటేశ్వరరావు, సభ్యులుగా కంప వెంకటరమణ, గుబులి రత్న సంధ్యలత, పులిగడ్డ రాటాలు, ఈద గంగయ్య, కొత్తపల్లి లక్ష్మి, సీహెచ్ తాతాజీ ఎంపికయ్యారు. ఇందుకు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు బోర్డు మెంబర్లు కృతజ్ఞతలు తెలిపారు.